క్లుప్తంగా

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ మోతీనగర్‌ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఎంసీహెచ్‌ఎస్‌, వివేక్‌ డెంటల్‌ల ఆధ్వర్యంలో ఉచిత దంత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంసీహెచ్‌ఎస్‌ పర్సనల్‌ చైర్‌ పర్సన్‌ హనుమంతరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు దంతాల సంరక్షణకు వైద్య పరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని మోతీనగర్‌ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

ఆల్విన్‌కాలనీ: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ నిలిపి వేయనున్నట్లు విద్యుత్‌ ఏఈ ఎస్‌. రాఖేష్‌ కుమార్‌ గౌడ్‌ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11 నుంచి 2 గంటల వరకు మెరిడియన్‌ స్కూల్‌ ప్రాంతం, ఎస్‌ కన్వెన్షన్‌ లైన్‌, బుట్ట కన్వెన్షన్‌ రోడ్డు నుంచి ఎన్‌ఐఏ వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పనులను పరిశీలించిన కార్పొరేటర్‌



పనులను పరిశీలిస్తున్న రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌లోని పటేల్‌కుంట పార్కులో జరిగే అభివృద్ధి పనుల్లో భాగంగా శనివారం బోరు పనులను కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి రంగారావు శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పడిగేశ్వరరావు, చెన్నారావు, రవీందర్‌ రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బండి రమేష్‌ తదితరులు

కూకట్‌పల్లి: వివేక్‌నగర్‌కు చెందిన గైక్వాడ్‌ లక్ష్మీకు రూ.1.25 లక్షల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ బాధితుడికి అందజేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లీకేజీతో రోడ్డుపై మురుగు



మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ గాయత్రినగర్‌ 60 ఫీట్ల రోడ్డులో కొన్ని రోజుల నుంచి డ్రైనేజీ పొంగి పొర్లడంతో రోడ్డంతా మురుగునీటితో ప్రవహిస్తున్నది. దీంతో స్థానికులు దుర్గంధం, దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులకు సమస్యను పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోనే పాఠశాల, దుకాణ సముదాయాలు ఉండటంతో మురుగునీరు దాటుకుంటూనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మూసాపేట: నిర్మానుష ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి కైత్లాపూర్‌కు వెళ్లే దారిలో నిర్మానుష ప్రాంతం నుంచి దుర్వాసన వస్తుంది. దీంతో స్థానికులు పరిశీలించగా.. కుళ్లిన మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. వారం, పది రోజుల క్రితం హత్య చేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం పక్కనే పింక్‌ కలర్‌ చీర ఉందని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్రపు డెక్క.. దోమల మోత!

రోగాలబారిన బస్తీ, కాలనీలవాసులు





గుర్రపుడెక్కతో నిండిన పరికి చెరువు

ఆల్విన్‌కాలనీ, ధరణినగర్‌లోని ప్రకృతి నివాస్‌ అపార్టుమెంట్‌లో ఓ ఇంట్లో చంపిన దోమలు

చెరువులు, కుంటల్లో గుర్రపుడెక్క పేరుకుపోతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆల్విన్‌ కాలనీ డివిజన్‌ పరిధిలో గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలని ఆయా కాలనీ సంక్షేమ సంఘాలు డిమాండ్‌ చేస్తున్నాయి. నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను కూడా తొలగించాలని కోరుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి పిచికారీ చేయించాలని వేడుకుంటున్నారు..

ఆల్విన్‌కాలనీ:

దోమల బాధ భరించలేకపోతున్నామని బస్తీ, కాలనీలవాసులు వాపోతున్నారు. పగలూ రాత్రి తేడా లేకుండా దాడి చేస్తున్నాయని, రోగాలబారిన పడుతున్నామని గగ్గోలు పెడుతున్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని ధరణినగర్‌, భూదేవిహిల్స్‌, తులసినగర్‌, శ్రీతులసినగర్‌, చక్రధర్‌ కాలనీ, ఎల్లమ్మ బండ, పీజేఆర్‌ నగర్‌, సాయినగర్‌, తదితర కాలనీలు, బస్తీల్లో జ్వరాలు ప్రబలాయి. దీంతో ఆసుపత్రి ఖర్చులు తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డోర్లు, కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకున్నా దోమలు ఆగడంలేదన్నారు. పరికి చెరువు, ఎల్లమ్మ చెరువు, నాలాలు, డ్రైనేజీల్లో పూడిక తీయక పోవటం, పారిశుద్ధ్య లోపంతో దోమలు ప్రబలుతున్నాయని, జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది ఫాగింగ్‌, నివారణ మందును పిచికారి చేయాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దోమలకు ఆవాసంగా మారిన ఆల్విన్‌కాలనీలోని నాలా

స్వైరవిహారం



దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా కుడుతున్న దోమలతో అనారోగ్యం బారిన పడుతున్నాం. పరిసరాల శుభ్రత, నాలాలో వ్యర్థాలు, చెరువుల్లో గుర్రపుడెక్కతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఇళ్లల్లో దోమల దండు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు రోజూ ఫాగింగ్‌ చేయించాలి. –ప్రసాద్‌, ధరణినగర్‌

బాలానగర్‌ పోలీస్‌ స్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు



రికార్డుల నిర్వహణ, ఎఫ్‌ఐఆర్‌ నమోదు గురించి వివరిస్తున్న సీఐ

బాలానగర్‌: శిక్షణలో భాగంగా 2024 బ్యాచ్‌ ట్రైనీ ఐపీఎస్‌లు శనివారం బాలానగర్‌ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లో జరుగుతున్న పనులను, వివిధ కేసుల పనితీరును పరిశీలించారు. 2024 ట్రైనీ ఐపీఎస్‌ బ్యాచ్‌కి చెందిన శశాంత్‌ ఎస్‌ఎం, కర్ణాటక, అభిషేక్‌ పిర్రా, రాజస్థాన్‌, హస్సన్‌ రియాజ్‌ (మాల్దీవులు) పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన వారిలో ఉన్నారు. వీరికి బాలానగర్‌ సీఐ నర్సింహరాజు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. స్టేషన్‌ పరిధిలో జరిగే వివిధ అంశాల గురించి సీఐ వివరించారు. ఎస్‌ఐలు రాంనారాయణ్‌, హాజీమాయి, సరళ, ఏఎస్‌ఐలు ఆంజనేయులు, ప్రభాకర్‌, స్టేషన్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న బండి రమేష్‌

బాలానగర్‌: ఫతేనగర్‌ డివిజన్‌ ప్రభాకర్‌ రెడ్డి నగర్‌లో నిర్మించనున్న ఆలయానికి కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ రూ. 50 వేల విరాళాన్ని బాలానగర్‌ పార్టీ కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. సోమవారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరగనుందని, ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండి రమేష్‌ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య, యుగంధర్‌, యలమంచి ఉదయ్‌ కిరణ్‌, శివ చౌదరి, రాజ్‌ పటేల్‌, అస్లాం, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ 23వ వార్షిక వేడుకలు



అన్నదానంలో పాల్గొన్న ఆలయ నిర్వాహకులు

మోతీనగర్‌: అన్ని దానాల కన్నా అన్నదానం మహా గొప్పదని పర్వత్‌నగర్‌ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహ్మద్‌ జాహెద్‌ షరీఫ్‌ బాబా, ప్రధాన కార్యదర్శి సుంకన్న అన్నారు. అల్లాపూర్‌ డివిజన్‌, పర్వత్‌నగర్‌ బస్తీలోని సిద్ధి వినాయక, దుర్గామల్లేశ్వరి ఆలయ 23వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, మహా గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, స్నాపనోత్సవం, పార్వతి పరమేశ్వర కల్యాణ మహోత్సవంతో వేడుకలు ముగిశాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పర్వత్‌నగర్‌ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు బి. శంకర్‌ గంగపుత్ర, నాయకులు బ్రహ్మ, కొమిశెట్టి శ్రీనివాసరావు, రమాకాంత్‌, గవిరెడ్డి, వెంకటేష్‌, చంద్రమౌళి పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఆలయ చైర్మన్‌ నాగిరెడ్డి తదితరులు

మూసాపేట: భరత్‌నగర్‌ కాలనీలోని హరిహర క్షేత్ర దేవస్థానంలో పాలక మండలి చైర్మన్‌ డాక్టర్‌ పి నాగిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం శ్రీ దత్తాత్రేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి మండపారాధన, దేవతా హోమం, యంత్రస్థాపన, ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. అనంతరం అన్నదాన సమారాధన జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు బండి రమేష్‌, సత్యం శ్రీరంగం, తూము మనోజ్‌ కుమార్‌, కమిటీ సభ్యులు సూర్యనారాయణ మూర్తి, క్రిష్ణ సూరి, వెంకటేష్‌యాదవ్‌, సంతోష్‌కుమార్‌, లక్ష్మీ నారాయణ, బి. మణెమ్మ పాల్గొన్నారు.

వృక్షార్చన పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్‌ అధినేత కె.చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వృక్షార్చన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. 17న పెద్ద ఎత్తున మొక్కలు నాటనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో శ్యామల రాజు, సుబ్బరాజు, శ్రీనివాస్‌, రోజా, రవియాదవ్‌, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కనువిందు.. నృత్య ప్రదర్శన





మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం వైఎస్‌ కళ్యాణి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. ఇందులో శివాష్టకం, బాలగోపాల తరంగం తదితర అంశాలను ప్రదర్శించారు.అలాగే భువనేశ్వరీ బారక్‌ శిష్య బృందం నమశ్శివాయ, అన్నమాచార్యకీర్తన, వినాయకకౌతం తదితరాలను ప్రదర్శించారు. అవని, దీపాలి, అక్షర, రసజ్ఞ, నిత్యశ్రీ, దీక్షిత, శ్లోక, సహన, ఇసాన్వి, శ్రీహిత, తాన్విక, అక్షయ తదితరులు పాల్గొని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాట్యగురువులు డాక్టర్‌ వనజ, డాక్టర్‌ కిరణ్మయిలు కళాకారులను అభినందించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమాలలో భాగంగా శనివారం హరిప్రియ సంకీర్తనార్చన చేశారు.

మైత్రీ కార్యాలయాన్ని ప్రారంభించిన పీఏసీ చైర్మన్‌



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని ఎల్లమ్మబండలో మైత్రీ కార్యాలయాన్ని శనివారం పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమలకు జీహెచ్‌ఎంసీ నోటీసులు

బాలానగర్‌: నవజీవన్‌నగర్‌, ప్రశాంతినగర్‌లలోని పారిశ్రామిక వాడల్లో రెండు రోజుల నుంచి కూకట్‌పల్లి జీహెచ్‌ఎంసీ అధికారులు చిన్న పరిశ్రమల నిర్వాహకులకు ట్రేడ్‌ లైసెన్స్‌లు తీసుకోవాలని నోటీసులు జారీ చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా చిన్న తరహా పరిశ్రమలు నడుపుకుంటూ జీఎస్‌టీ చెల్లిస్తున్నామని, ఎంఎస్‌ఎంలో నమోదు చేసుకొని పరిశ్రమలు నడుపుతున్నామని, ప్రోత్సహించాల్సింది పోయి ట్రేడ్‌ లైసెన్స్‌ కోసం నోటీసులు జారీ చేయడం సరికాదని పలువురు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ఆదుకోవాలని కోరారు.

నూతన కార్యవర్గం నియామకం



నియామక పత్రం అందజేస్తున్న అల్లం నారాయణ

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ యూనియన్‌ ఆఫ్‌ వర్కింగ్‌ జర్నలిస్టు కూకట్‌పల్లి నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని శనివారం ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా నిమ్మల శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శిగా కోహీర్‌ నాగరాజు యాదవ్‌, కోశాధికారిగా సదా మహేష్‌లు ఎన్నికయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఏ. మారుతి సాగర్‌, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌కే దయాసాగర్‌ అందజేశారు. మిగిలిన కార్యవర్గాన్ని త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రకటిస్తామని వారు తెలిపారు.

వైభవంగా రేణుకా ఎల్లమ్మ జాతర

సుభాష్‌నగర్‌: గాజులరామారంలో రేణుకా ఎల్లమ్మదేవి జాతర 25వ రజోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం చండి నవగ్రహ సహిత లక్ష్మీ గణపతి హోమం వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య జరిగింది. ఆదివారం ప్రధాన జాతర ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది. ఈ జాతర 18 వరకు కొనసాగుతుందని తెలిపారు.

సూర్య నమస్కారాలతో లిమ్కా బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌లో స్థానం

సుభాష్‌నగర్‌: నేటి ఉరుకుల పరుగుల జీవితంలో వ్యాయామం అనేది మరిచిపోయారని, ప్రతి ఒక్కరూ విధిగా ఉదయం యోగా చేయాలని ప్రముఖ న్యాయవాది ఆంజనేయులు ముదిరాజ్‌ అన్నారు. ఇటీవల సిద్దిపేటలో వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్వర్యంలో 4 వేల మందితో శత సహస్ర సూర్యనమస్కార పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో షాపూర్‌నగర్‌లో శివ శక్తి ధ్యాన యోగా కోచ్‌ విజయకుమార్‌ సారథ్యంలో 11 మంది సాధకులు పాల్గొని 300కు పైగా సూర్య నమస్కారాలు చేసి 30295 రౌండ్‌లో ప్రతిభతో వరల్డ్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ ఇంటర్‌ నేషనల్‌లో స్థానం పొందారు. విజయం సాధించిన యోగా సాధకులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. శనివారం షాపూర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఆంజనేయులు, శివ శక్తి ధ్యాన యోగా వ్యవస్థాపకులు మల్లేష్‌ తదితరులు అభినందించారు.



సూర్య నమస్కారాల్లో ప్రతిభ చాటిన యోగా సాధకులతో ఆంజనేయులు

సంత్‌ సేవాలాల్‌ జీవితం ఆదర్శం

- పీఏసీ చైర్మన్‌ గాంధీ, ఎమ్మెల్యే కృష్ణారావు
- ఘనంగా సేవాలాల్‌ జయంతి ఉత్సవాలు



బాలాజీనగర్‌ సేవాలాల్‌ నగర్‌లో జయంతిలో ఎమ్మెల్యే కృష్ణారావు తదితరులు



పీజేఆర్‌ నగర్‌లో.. పీఏసీ చైర్మన్‌ గాంధీ, కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌ గౌడ్‌ తదితరులు



పర్వత్‌నగర్‌ కమ్యూనిటీ హాల్‌లో వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్‌ సబిహా బేగం తదితరులు

కూకట్‌పల్లి: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌ సేవాలాల్‌ అని, ఆయన సమాజ శ్రేయస్సు కోసం చేసిన కృషిని ఆదర్శంగా తీసుకోవాలని పీఏసీ చైర్మన్‌ అరెకపూడి గాంధీ, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, అన్నారు. సంత్‌ సేవాలాల్‌ మహరాజ్‌ జయంతి సందర్భంగా శనివారం కార్పొరేటర్‌లు, పలు పార్టీల నాయకులు సంత్‌ సేవాలాల్‌ మహరాజ్‌ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయన పాటలు, రచనల ద్వారా ప్రజలను జాగృతం చేశాడని గుర్తు చేశారు. అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశారన్నారు. దేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్త సేవాలాల్‌ మహరాజ్‌ అని గుర్తు చేశారు. బాలాజీనగర్‌లోని సేవాలాల్‌ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ పగుడాల బాబురావు, ప్రభాకర్‌ గౌడ్‌, తహసీల్దార్‌ స్వామి, ఆర్డీఓ హరినాథ్‌, శంకర్‌, కైలా, హరి, కల్యాణ్‌, భీమ్లా, రతన్‌, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పీజేఆర్‌ నగర్‌లో జరిగిన జయంతి వేడుకల్లో పీఏసీ చైర్మన్‌ గాంధీ, కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌ గౌడ్‌ పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో...

జేఎన్‌టీయూహెచ్‌లో ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ ఆధ్వర్యంలో సేవాలాల్‌ జయంతి సందర్భంగా శోభా యాత్ర, భోగ్‌బండార్‌, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రాహుల్‌ నాయక్‌ మాట్లాడుతూ.. సంత్‌ సేవాలాల్‌ కేవలం బంజారాలకే కాకుండా హిందూ ధర్మాన్ని ఆచరిస్తూ జీవిస్తున్న అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆంజనేయ ప్రసాద్‌, మెకానికల్‌ విభాగాధిపతి రాంజి, సమ్ములాల్‌, అధ్యాపకులు సురేష్‌ నాయక్‌, బాలకృష్ణ, శివకుమార్‌, శివారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం ఆధ్వర్యంలో..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సేవాలాల్‌ మహరాజ్‌ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎం. ధర్మ నాయక్‌, ఆర్‌ శ్రీరాం నాయక్‌, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌ మాజీ అధ్యక్షులు శేరి సతీష్‌ రెడ్డి పాల్గొన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ రమ్యా గ్రౌండ్‌ నుంచి టెంపుల్‌ బస్టాప్‌, రోడ్డు నంబర్‌ 2, జేఎన్‌టీయూ, ఫోరం మాల్‌ మీదుగా 5వ ఫేజ్‌ కమ్యూనిటీ హాల్‌ వరకు వందలాది మంది గిరిజనులు జెండాలు చేతబట్టి భారీ ర్యాలీ నిర్వహించారు.



జేఎన్‌టీయూహెచ్‌లో ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ ఆధ్వర్యంలో శోభాయాత్ర



తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ..